మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం
29 అక్టోబర్ 2026
పేజీలు : 6
@mvaartanews
www.mivaartanews.com

శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారం.

- విద్యార్థుల ప్రతిభాపాటవాలకు బహుమతులు.
- సీనియర్ జర్నలిస్ట్, శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు.
- శనగపాటి మురళీకృష్ణ.

ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టుల ప్రతిభను పోత్సాహమందించేందుకు ఏటేటా నగదు పురస్కారాలు అందించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు శనగపాటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు.ఎల్‌నినో – పేదల జీవనంపై ప్రభావం అనే అంశంపై ఈ ఏడాది అక్టోబర్ 30 నుండి నవంబర్ 30 వరకు రాసిన కథనాలను డిశెంబర్ 10వ తేదీలోగా తమ ఫౌండేషన్ చిరునామాకు పంపించాలని సూచించారు. ప్రింట్ మీడియా జర్నలిస్టులు పేపర్ క్లిప్పింగ్‌తో పాటు ఆ రోజు పత్రికను కథనంతో జత చేసి పంపించాలని సూచించారు. అలాగే డిజిటల్ మీడియా విలేకర్లు కథనంతో పాటు వెబ్ సైట్ లింక్‌ను పంపించాలన్నారు. అవార్డుకు పంపేవారు హామీ పత్రం, పాస్‌పోటో, చిరుమాను జత చేసి పంపించాలన్నారు. పోటీకి వచ్చిన కథనాలను సీనియర్ జర్నలిస్టులు నామా పురుషోత్తం, కనకం సైదులు ఆధ్వర్యంలో కమిటీ పరిశీలించి ఎంపిక చేస్తుందని తెలిపారు. అవార్డుల ఎంపికలో కమిటీదే తుది నిర్ణయమని, దీనిపై ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జర్నలిస్టులకు 2028 జనవరిలో అవార్డులను అందచేస్తామన్నారు. ప్రింట్ మీడియా జర్నలిస్టుకు 5000 నగదు బహుమతి, డిజిటల్ మీడియాకు 3000 నగదు బహుమ తితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందచేసి సన్మానించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టు మిత్రులు ఈ పురస్కారానికి తమ కథనాలను టి మీడియా కార్యాలయం, ఆర్టీసీ డిపో వెనుక, మామిళ్ళగూడెం అనే చిరునామాకు పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 98666 45218, 8919710365 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. నెలకో కవి సమ్మేళనం నిర్వహణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నెలకో కవి సమ్మేళనం నిర్వహించి వర్ధమాన కవులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి నెలా ఏదైనా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేస్తామన్నారు. అలాగే సమకాలీన అంశాలపై చర్చా వేదికలు, సెమినార్లు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఫౌండేషన్ కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించి సహకరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో జర్నలిస్టుల అవార్డు కమిటీ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు నామా పురుషోత్తం, ఫౌండేషన్ సభ్యులు జి.రామారావు పాల్గొన్నారు.



శీనన్న జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ శ్రేణుల విస్తృత సేవా కార్యక్రమాలు.

- ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు.

ఖమ్మం కూసుమంచి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శీనన్న అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం, కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయాల్లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టి అభిమానాన్ని చాటుకున్నారు. తల సేమియా బాధితుల కోసం రక్తదానం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, సీనియర్ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం తలసేమియా బాధితులకు ఉపయోగపడేలా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 130 మంది రక్తదానం చేశారు. దాదాపు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోనూ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 100 మంది రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రజల సంక్షేమమే ధ్యేయం ఈ సందర్భంగా ఖమ్మం, కూసుమంచి లలో జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కృషి చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల శీనన్నగా గుర్తింపు పొందారని హర్షం వ్యక్తం చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్యాంపు కార్యాలయాల వద్ద అభిమానులు జై శీనన్న నినాదాలతో సందడి చేశారు. ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్ది శ్రీనివాసరెడ్డి, ఉమ్మినేని కృష్ణ, పైడిమర్ల అశోక్‌రెడ్డి, లింగాల రవికుమార్, తాళ్లూరి రాము, ఇసగిండ్ల నాగేశ్వరరావు, ఇమామ్ భాయ్, తదితరులుపాల్గొన్నారు.కూసుమంచిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మంకెన వాసు, కార్యదర్శి హఫీజుద్దీన్, సీడీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం చేయాలి.

- ఎల్‌నినో ప్రభావంపై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి.
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఢిల్లీలో జరగనున్న నిరసన ర్యాలీ తదితర అంశాలపై చర్చించారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని నూతి సత్యనారాయణ గౌడ్ నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేలా మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని పలు కీలక సూచనలు చేశారు.ఎల్‌నినోపై ప్రజలకు వాస్తవాలు వివరించాలి. ఎల్‌నినో ప్రభావంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ నాయకులు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సమావేశంలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని, అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదనే విషయాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి మండల కేంద్రం నుంచి గ్రామస్థాయి వరకు ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని నాయకులకు సూచించారు.ఢిల్లీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి కేంద్ర ప్రభుత్వం నిరసన కార్యక్రమానికి అడ్డంకులు సృష్టిస్తున్నప్పటికీ, రేపు ఢిల్లీలో జరగనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ ముఖ్య నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు తమకు అనుకూలమైన ప్రయాణ ఏర్పాట్లు చేసుకొని నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యవర్గ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





మారెమ్మ తల్లి ఆశీస్సులు మా శీనన్నపై ఎల్లవేళలా ఉండాలి.

- ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక పూజలు.





ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: ఖమ్మం రూరల్ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు రెడ్డిపల్లి గ్రామంలోని మారెమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ అమ్మవారి ఆశీస్సులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. పేదల పెన్నిధిగా, బడుగు బలహీన వర్గాలకు కొండంత అండగా నిలుస్తూ ఆపదలో ఉన్నవారికి అన్నా అంటే నేనున్నా అంటూ భరోసానిచ్చే శీనన్నకు అమ్మవారి చల్లని దీవెనలు అందించాలని ప్రార్థించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రంతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి.

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు.
- భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి.

ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:



బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుఫాన్ అర్నబ్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. రెండు జిల్లాల్లోనూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న నారాయణ విద్యార్థులకు నగదు బహుమతులు.



ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మంలో నారాయణ విద్యాసంస్థల్లో చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు ఖమ్మం నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నారాయణ విద్యాసంస్థలు నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఎస్. అమూల్య జాయిస్, కె. స్ఫూర్తి, డి. మిధిలేష్, జి. లేఖన, ఇ. వరుణ్, డి. విహాన్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల పట్ల పాఠశాల పీఈటీలు చందు, పావని, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

30న ఫిజికల్, బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ.

ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: ఖమ్మం జిల్లాలో 2024 డీఎస్సీలో ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సు, బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు లో కాస్ట్ నో కాస్ట్ తో ప్రయోగాలు ఎలా చేయాలనేటువంటి అంశంపై ఈ నెల 30న శిక్షణ ఇవ్వనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్వి రమేష్, అలవాల నాగేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో 30న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ట్రైనింగ్ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

పల్లెల్లో పండుగవై శీనన్న జన్మదిన వేళ ప్రత్యేక గేయం.

- మంత్రి పొంగులేటిపై అభిమానంతో పాట రూపకల్పన.
- క్యాంపు కార్యాలయంలో గేయావిష్కరణ.



ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

పల్లెల్లో పండుగై ప్రజల గుండెల్లో అభిమానమై నిలిచిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక గేయాన్ని రూపొందించారు. పల్లెల్లో పండుగవై శీనన్న పల్లవితో సాగే ఈ పాటను బుధవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.బంజారా రమేష్ ఆలపించిన ఈ ప్రత్యేక గేయాన్ని సాంస్కృతిక విభాగం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్ చార్జ్ కానుగుల రాధాకృష్ణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కళాకారులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న మంత్రి పొంగులేటిపై అభిమానంతో ప్రత్యేక పాటను రూపొందించడం అభినందనీయమన్నారు. జన్మదిన వేళ పాట రూపంలో తమ అభిమానాన్ని చాటుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం కానుగుల రాధాకృష్ణతో పాటు పలువురు కళాకారులు తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేశారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి మాజీ ఎమ్మెల్యే సండ్ర.





సత్తుపల్లి అక్టోబర్ 28 మీ వార్త టౌన్ రిపోర్టర్:

సత్తుపల్లి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.బుధవారం సత్తుపల్లిలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదులో ఏవైనా సమస్యలు ఎదురైతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని సంప్రదించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సండ్ర వెంకటవీరయ్య కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కౌన్సిలర్ మొహమ్మద్ భాష, మోరంపూడి ప్రభాకర్, షేక్ రఫీ, వీరప్పనేని బాబి, అమరవరపు కృష్ణారావు, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, గుండ్ర రఘు, మారుతి సూరిబాబు, మేకల నరసింహారావు, నడ్డి ఆనందరావు, జొన్నలగడ్డ విజయ్, గుంజి వెంకటేశ్వరరావు, అక్షింతల చంటి తదితరులున్నారు.

ఆర్నాబ్ తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండండి.

- కామేపల్లి ఏవో తారా దేవి.



కామేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం, బంగాళాఖాతం లోని తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు,ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కామేపల్లి మండల వ్యవసాయ అధికారి బి. తారా దేవి బుధవారం కోరారు. రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకో వాలని, ఇప్పటికే కోసిన వరి కుప్పలను టార్పాలిన్ తో పూర్తిగా కప్పి గాలికి ఎగిరి పోకుండా గట్టిగా బిగించాల ని అన్నారు. నూర్చిడి చేసిన ధాన్యాన్ని తేమ తగలకుం డా సురక్షితమైన ఎత్తైన ప్రదేశంలో ఉంచాలని, ధాన్యం నిల్వ చేసే గోదాములు, పైకప్పులు, నీరు వెళ్లే కాలువలను ముందుగానే తనిఖీ చేసుకోవాలని, పొలాల్లో నీరు నిల్వ కాకుండా నీటి పారుదల మార్గాలను పరిశీలించాలని సూచించారు. పంట, ఎరువులు, విత్తనాలను నీరు చేరని ప్రదేశంలో భద్రపరచాలని, విద్యుత్ తీగలు, పడిపోయిన చెట్లు, ఉధృతమైన నీటి ప్రవాహాలకు దూరంగా ఉండాలని కోరారు. పశువు లను సురక్షితమైన ఆశ్రయం లో ఉంచాలని, రైతులు ఐఎండి,జిల్లా అధికారుల అధికారిక సూచనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రైతుల భద్రతే ముఖ్యమని తారా దేవి పేర్కొన్నారు.

ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం.

- ఈఆర్ఓ లతో ఎలక్టోరల్ రోల్ పై సమీక్షించిన ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్.





ఖమ్మం కూసుమంచి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:

ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. దేవసేన తెలిపారు. కూసుమంచి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఈఆర్ఓ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. దేవసేన మాట్లాడుతూ ఎలక్టోరల్ తయారు ఎన్నికల ముఖ్య ఘట్టమని అన్నారు. ఎలక్టోరల్ ప్రక్రియలో స్వీకరించిన ఫారం 6, 6 ఏ, 7, 8 ల పరిష్కార ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్ఓ ల తనిఖీలు చేయాలన్నారు. ఎన్ఆర్ఐ ల నుండి వచ్చిన దరఖాస్తులు నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో డోర్ టు డోర్ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్ర పరిశీలనలో గుర్తించిన సవరణలు ఎలక్టోరల్ రోల్ చేయాలన్నారు.రోల్ డాటా బేస్ లో మార్క్డ్ ఓటర్ల గుర్తింపు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక చేర్పులు, అత్యధిక తొలగింపులు చేసిన 20 పోలింగ్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో పునఃపరిశీలన చేయాలన్నారు. నోటీసుల జారీ ప్రక్రియ సక్రమంగా చేయాలన్నారు. హియరింగ్ ప్రక్రియకు తగిన సమయం ఇవ్వాలన్నారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి రికార్డు భద్రపరచాలన్నారు. సరిహద్దు జిల్లాల వద్ద ద్వంద నమోదులు తనిఖీ చేయాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. ప్రింట్ అయి వచ్చిన కార్డులను సంబంధిత ఓటర్లకు చేరేలా చూడాలన్నారు. యువ ఓటర్ల నమోదు పట్ల దృష్టి సారించాలన్నారు. ఓటర్ల ఫిర్యాదుల పరిష్కారంపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఖచ్చితమైన ఎలక్టోరల్ రోల్ రూపకల్పనకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్తెలిపారు.సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 5 శాసనసభ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయని, దీనికి సంబంధించి 29 మంది ఏఈఆర్ఓలు, 88 మంది అదనపు ఏఈఆర్ఓలు, 148 మంది సూపర్‌వైజర్లు, 1,479 మంది బీఎల్ఓలు బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య 10,85,927 ఉండగా, జెండర్ రేషియో 1069గా, ఈపీ రేషియో 688గా నమోదైందని, అలాగే ఎపిక్ కవరేజ్ 99.99 శాతమ్ పూర్తయిందని వివరించారు. జిల్లాలో 18-19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లు 11,596 మంది, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 9,111 మంది, 23,588 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ద్వారా అదనంగా 19 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,479కు చేరిందని తెలిపారు.ఎలక్టోరల్ రివిజన్ లో 53 దరఖాస్తులు ఎన్ఆర్ఐ ల నుండి అందాయన్నారు. ఫారం 6 లు 2042, ఫారం 6 ఏ లు 41, ఫారం 7 లు 153, ఫారం 8 లు 1936 మొత్తంగా 4172 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, పరిష్కారానికి చర్యలు వేగవంతం చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ఎన్నికల డిటి అన్సారీ, నాయబ్ తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పండితాపురం లో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు.

- కేక్ కట్ చేసిన మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు.





కామేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో పశువుల సంతలో పొంగులేటి ప్రధాన అనుచరుడు,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో కొండాయిగూడెం సొసైటీ అధ్యక్షులు ధనియాకుల హనుమంత రావు, కొమ్మినేపల్లి సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జున రావు తదితరులు పాల్గొని భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ.. మాట ఇస్తే తప్పకుండా ఆరు నూరైనా పిలిస్తే ఎక్కడ ఉన్నా నేనున్నానంటూ వచ్చే మంచి మనసున్న పొంగులేటి శీనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, రైతుల కోసం భూభారతి లాంటి ఎన్నో వినూత్న పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తున్న ఘనత వారికే దక్కిందని, పదిమంది బాగుకోసం తపనపడే మంచి హృదయం గల వ్యక్తి నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని, ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు మల్లి బాబు యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనియా కుల మాధవరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పుగండ్ల వీరభద్రం, శీలం పుల్లయ్య, గుగులోతు రవి, చల్ల మల్లయ్య, బండి ఉపేందర్ మొగిలి శ్రీను, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బాదావత్ నాగరాజు పల్లపు ప్రతాప్, పాటిబండ్ల ప్రసాద్, అయితన బోయిన విఠల్ రావు, బానోత్ లక్ష్మ, దేరంగుల తిరపయ్య, తురక బిక్షం, దేరంగుల రామారావు, ఎస్ కె.సొందు, పగిడిపల్లి రాములు, తదితరులు భారీగా పాల్గొన్నారు.

సింగరేణి జేవీఆర్‌సీహెచ్‌పీలో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు.

- ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికుల మధ్య వేడుకలు.



సత్తుపల్లి అక్టోబర్ 28 మీ వార్త ఆర్ సి:

సత్తుపల్లి సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్‌సీహెచ్‌పీలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. జనక్ ప్రసాద్ సూచన మేరకు, జేవీఆర్‌సీహెచ్‌పీ ఫిట్ సెక్రటరీ నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి మంత్రివర్యులకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ గడ్డపై పుట్టి, అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర మంత్రిగా ఉన్నత స్థాయికి చేరుకోవడం మనందరికీ ఎంతో గర్వకారణమని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజలకు, కార్మికులకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి స్థానిక శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్‌తో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారం, మద్దతు ఎంతో కీలకమని కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ తన విజయానికి సహకరించిన నాయకుల అండదండలను ఎప్పటికీ మరచిపోదని తెలిపారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కూడా స్థానిక శాసనసభ్యురాలుమట్టా రాగమయి దయానంద్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మద్దతుతో ఐఎన్‌టీయూసీని మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్మికులందరినీ సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని కోటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.

పాల్గొన్న నాయకులు, కార్మికులు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, బ్రాంచ్ ఆర్గనైజేషన్ సెక్రటరీలు గోపినాథ్, నజీర్, హమీద్, రమేష్, ఫిట్ సెక్రటరీలు షణ్ముఖాచారి, జగదీష్, ఐ.వి. రెడ్డి, రామ్ చందర్, జగన్నాథం, డీఎల్ఆర్ ఇన్‌చార్జి సుభాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు డీఎల్ఆర్ కార్మికులు, ఇతర కార్మిక సోదరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.

జననేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

- ఆకునూరి సుప్రియ 15వ డివిజన్ కార్పొరేటర్



కొత్తగూడెం అక్టోబర్ 28 మీ వార్త: నిరంతరం ప్రజా సంక్షేమం కోసం ప్రజా పరిపాలన అందిస్తున్నతెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలను కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరు సుప్రియ ఆధ్వర్యంలో వారి ఇంటి ఆవరణలో ఘనంగా నిర్వహించడం జరిగినది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాక రాష్ట్రంలో ప్రజల మనిషిగా ప్రజలకు చేరువై వారి సమస్యల సాధనలో భాగమై జనం కోసం జీవిస్తూ జన సంక్షేమ కోసం పరితపించే వ్యక్తి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని ఆకునూరి సుప్రియ కొనియాడారు, అలాంటి వ్యక్తి సంపూర్ణ ఆయురారోగ్యాలతో శతవసంతాలు తన పుట్టినరోజులు జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నేతలతో సామూహికంగా కేక్ కట్ చేయించిన సుప్రియ మునిసిపాలిటీలో పని చేసే సిబ్బందికి మహిళలకు చీరలు పురుషులకు గిఫ్టులు అందించి స్వీట్ పంచి ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన వారందరూ శ్రీనివాస్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంత వెంకటరమణ, మజీద్, సారంగపాణి, గణేష్, తాజుద్దీన్, కుమారస్వామి, ఆయుబ్, రవి, కొమరయ్య, రాజవీర్, సుందర్, రాజశేఖర్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తితో పొంగులేటి జన్మదిన వేడుకలు.

- అయ్యప్ప స్వాములకు భిక్ష అందజేసిన ఎమ్మెల్యే . మట్టా రాగమయి దయానంద్.
- మంత్రి పొంగులేటి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమం.
- మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా కమల్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ.





సత్తుపల్లి అక్టోబర్ 28 మీ వార్త ఆర్‌సీ: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు సత్తుపల్లిలో ఆధ్యాత్మికత, సేవాభావం మేళవింపుగా సాగాయి. జన్మదిన వేడుకలను కేవలం శుభాకాంక్షలకే పరిమితం చేయకుండా, సేవా కార్యక్రమంతో ప్రత్యేకతను చాటారు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. మంత్రి పొంగులేటి జన్మదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలోని హరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప స్వాములకు ప్రత్యేక భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా కమల్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ హాజరై స్వయంగా అయ్యప్ప స్వాములకు భిక్షను వడ్డించి తన సేవాభావాన్ని చాటుకున్నారు.

పొంగులేటి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష.

ప్రజాసేవలో నిరంతరం ముందుండే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.మంత్రి జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం ద్వారా వేడుకలకు సేవా పరిమళాన్ని జోడించారు. స్వయంగా భిక్ష వడ్డించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

పొంగులేటి జన్మదిన వేళ.
సత్తుపల్లిలో మహిళల కబడ్డీ సంబరం.

- అట్టహాసంగా ప్రారంభమైన 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలు.
- మూడు రోజులపాటు క్రీడా సమరం. మహిళా సాధికారతకు క్రీడలతో ప్రోత్సాహం.
- కేక్ కట్ చేసి మంత్రి పొంగులేటికి జన్మదిన శుభాకాంక్షలు.

సత్తుపల్లి అక్టోబర్ 28 మీ వార్త ఆర్‌సీ: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో మహిళల కబడ్డీ క్రీడా సంబరం అట్టహాసంగా ప్రారంభమైంది. పట్టణంలోని రాణీ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ వేదికగా 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీలు మహిళా క్రీడాకారిణుల ప్రతిభకు వేదికగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లుతూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

మహిళా ప్రతిభకు పట్టం.సత్తుపల్లి ఖ్యాతికి మరో మెట్టు.



మహిళలు కేవలం చదువులోనే కాకుండా క్రీడారంగంలో నూ అద్భుత విజయాలు సాధించగలరని, అందుకు ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతగానో దోహదపడతాయని కార్యక్రమంలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా క్రీడాకారిణుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలకు సత్తుపల్లి వేదిక కావడం గర్వకారణమని, ఈ పోటీల ద్వారా సత్తుపల్లి పేరు రాష్ట్రవ్యాప్తంగా మరింత మారుమోగాలని ఆకాంక్షించారు.

నిర్వాహకుడు మువ్వా విజయబాబుకు ప్రత్యేక అభినందనలు.



మువ్వా విజయబాబు ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిజన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, వారు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.మహిళా సాధికారతకు ప్రోత్సాహం. క్రీడాకారిణులకు చేయూత. సత్తుపల్లి అభివృద్ధే మా లక్ష్యం

భద్రాచలం, పినపాక నియోజకవర్గాల టీజేఎంయూ
అధ్యక్షులుగా రామ్ లక్ష్మణ్, కొరస రవి ఏకగ్రీవ ఎన్నిక.

- నవంబర్‌లో రెండో మహాసభ నిర్వహణకు సన్నాహాలు..
- జర్నలిస్టులకు అండగా ఉంటాం: జిల్లా అధ్యక్షుడు సామల ప్రవీణ్.

భద్రాచలం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి:.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారిపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసుల నివారణకు తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ (టీజేఎంయూ) నిరంతరం పోరాడుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూనియన్ అధ్యక్షుడు సామల ప్రవీణ్ తెలిపారు. బుధవారం భద్రాచలం పట్టణంలో భద్రాచలం మాజీ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీజేఎంయూ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజేఐ) అనుబంధంగా కొనసాగుతున్న టీజేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ. ప్రభాకర్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో యూనియన్ మహాసభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ప్రవీణ్ వెల్లడించారు. ఇందులో భాగంగా మొదటి మహాసభను అశ్వారావుపేట నియోజకవర్గంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీ. ఉదయ రాఘవేంద్ర, నియోజకవర్గ అధ్యక్షుడు నూనె హనుమంతరావు, కమిటీ సభ్యులు, మండల స్థాయి నాయకులు సమన్వయంతో విజయవంతం చేశారని పేర్కొన్నారు.

భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు నూతన బాధ్యతలు.

భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు సంబంధించి రెండో మహాసభను నవంబర్ నెలలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడిగా గోగికార్ రామ్ లక్ష్మణ్‌ను, పినపాక నియోజకవర్గ అధ్యక్షుడిగా కొరస రవిని, భద్రాచలం మండల అధ్యక్షుడిగా శ్రీమన్నారాయణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం టీజేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ. ఉదయ రాఘవేంద్ర మాట్లాడుతూ, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, వారిపై నమోదవుతున్న కేసులను యూనియన్ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం, వారికి ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ ముందుండి పోరాడుతుందని హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని యూనియన్ సభ్యులకు ఎలాంటి సమస్య ఎదురైనా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా జర్నలిస్టులు.

జర్నలిస్టులు అధికారులను గౌరవిస్తూ, ప్రజలకు మరియు అధికారులకు మధ్య వారధిగా వ్యవహరించాలని రాఘవేంద్ర సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వాస్తవాలను ప్రతిబింబించేలా, ప్రజలకు అర్థమయ్యే రీతిలో వార్తలు రాస్తూ మంచి జర్నలిస్టులుగా గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. నవంబర్‌లో నిర్వహించనున్న రెండో మహాసభను విజయవంతం చేసేందుకు భద్రాచలం, పినపాక నియోజకవర్గాల సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎవరూ అధైర్యపడకుండా ఐక్యంగా ముందుకు సాగాలని, జర్నలిస్టుల రక్షణ, హక్కుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.







ఈ సమావేశంలో టీజేఎంయూ భద్రాచలం నియోజకవర్గ సభ్యులు ఎం. రాజేష్, టీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, టీ. రమణ, మాజీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రామలింగేశ్వరరావు, కే. దిలీప్, సభ్యుడు కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ చప్పిడి నాగేశ్వరరావుకు అశ్రునివాళి.

కొత్తగూడెం అక్టోబర్ 28 మీ వార్త ఆర్ సి:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం మండల పరిధిలో గల రామవరం పంజాబ్ గడ్డ ప్రాంత నివాసి చప్పిడి నాగేశ్వరరావు ఈరోజు సాయంకాలం ఐదు గంటల సుమారు సమయంలో పరమపదించడం దురదృష్టకరం, వీరి తండ్రి చప్పిడి రాధాకృష్ణ, కమ్యూనిస్టు పార్టీ నేపథ్యం కలిగిన వ్యక్తిగా స్వర్గీయ మనుబోతుల కొమరయ్య, వంగా రాజేశ్వరరావు, పిండిగా రతన్ కుమార్, మాణిక బాబు, ముంజ కనకయ్య, పరిగెల సాయిలు గార్లతో సమకాలికుడిగా ప్రజా ఉద్యమాలలో పాల్గొనడం మొత్తం వీరి కుటుంబం కమ్యూనిస్టు పార్టీ లో క్రియాశీలక భూమిక పోషిస్తూ, ప్రాంత కమ్యూనిస్టు పార్టీ కార్పొరేషన్, మున్సిపాలిటీ, తో పాటు కొత్తగూడెం శాసనసభకు జరిగిన ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయం కోసం శ్రమించిన కుటుంబం, నాగేశ్వరరావు తమ్ముడు కోటేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ లో క్రియాశీల సభ్యుడిగా ఉంటూ ఆటో యూనియన్ లో క్రియాశీలక భూమిక పోషిస్తూ కమ్యూనిస్టు పార్టీ ఏఐటీయూసీ ప్రజాసంఘాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న కుటుంబం ఇలాంటి నేపథ్యం కలిగిన కుటుంబంలో నాగేశ్వరరావు పరమపదించడం ఆ కుటుంబానికే కాక యావత్ రామవరం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటుగా భావిస్తూ ఉన్నామంటూ సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జములయ్య, కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ, రామవరం సిపిఐ బ్రాంచి కార్యదర్శి మర్రి గోపికృష్ణ, టూ టౌన్ ప్రజా సంఘాల నిర్మాణ కార్యదర్శి తూముల శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి మండల రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శి గుత్తుల శ్రీనివాస్, సిపిఐ నాయకులు రాజాని దేవదాసు, మన్నెం పల్లి మోహన్, తదితరులు నివాళులర్పించారు.

ఇమ్మడి ఆధ్వర్యంలో పొంగులేటి జన్మదిన వేడుకలు



కారేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు వేడుకలను సింగరేణి మండల నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా ఇమ్మడి తిరుపతి రావు మాట్లాడుతూ....బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలగాణ రాష్ట్రం లో అత్యంత ప్రజా ఆకర్షణ ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ప్రదానభూమిక పోషించిన పొంగులేటి శ్రీనన్న నాయకత్వంలో మళ్ళీ రెండవ సారి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది అని అన్నారు.శ్రీనన్న నిర్వహిస్తున్న రెవిన్యూ.హౌసింగ్ శాఖలు విజయవంతంగా అమలు కావడం ఆయనకు పాలన పై ఉన్న చిత్త శుద్ధి అని అన్నారు.పొంగులేటి శ్రీనన్న తప్పకుండా తెలంగాణ రాష్ట్రనికి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు.మండలం లో ఏ కార్యకర్తకు సమస్య వచ్చిన వెంటనే స్పందించే గుణం శ్రీనన్నది అని అన్నారు.దేవుని ఆశీర్వాదం తో ఆయన మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, నాయకులు మల్లెల నాగేశ్వరావు, మాధారం అజ్మీర నరేష్ నాయక్, తోగర శ్రీను, దూడ అర్జును రావు, ఆదేర్ల రామారావు, పేరుపల్లి సర్పంచ్ బానోతు వీరభద్రం, పప్పుల నిర్మల ఎం మల్లేష్, ఎం సుధాకర్, బండారి నాగేశ్వరావు, కె . బాలకృష్ణ, తురక రాంబాబు, చారి, మెడికల్ షాప్ వెంకట్, కొరివ వీరన్న లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలను తక్షణమే చేపట్టాలి
జిల్లా కార్యదర్శి కోలేటి డిమాండ్.

- తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా, వినతిపత్రం సమర్పణ.



కారేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సింగరేణి మండలంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులపై అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి కోలేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుంటే సరిపోదని, క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే యుద్ధప్రాతిపదిక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆకలి కేకలను నివారించేందుకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలి. వర్షాభావం వల్ల పంటలు వేయని భూములకు ఎకరానికి 30000 పరిహారం అందించాలి అన్నారు. ఎండిపోయిన వాణిజ్య పంటలకు ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. బావుల కింద ఉన్న కొద్దిపాటి పంటలనైనా కాపాడుకోవడానికి ఎటువంటి కోతలు లేకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగ్గులోతు తేజ నాయక్, పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, మండల నాయకులు పులకాని సత్తిరెడ్డి, రాకేష్, సక్రు, రంగయ్య, శ్రీను, అనసూయ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కొత్త లింగాల విద్యుత్ సబ్ స్టేషన్ ను సందర్శించిన ఏడిఈ.



కామేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండలం కొత్త లింగాల 33/11 కే వీ విద్యుత్ సబ్ స్టేషన్ ను రఘునాధపాలెం సబ్ డివిజన్ ఏడిఈ ఎం. యాదగిరి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.విద్యుత్ సరఫరా తీరుతెన్నులను ఈ సందర్భంగా పర్యవేక్షించా రు.తుఫాన్ ప్రభావం వలన వర్షాలు కురుస్తున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీ సుకోవడంతో పాటు ప్రజలు, రైతులను అప్ర మత్తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎన్. శ్రీనివాసులు,సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ





నేలకొండపల్లి అక్టోబర్:28 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బుధవారం తెలంగాణ సచివాలయంలో మంత్రిని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, ఇరగదిండ్ల నాగరాజు, బి.సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. నేలకొండపల్లి మండలంలోని సుర్దేపల్లి గ్రామంలో సర్పంచ్ గరిడేపల్లి సుజాత ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గువ్వలగూడెం గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోనూ మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు, కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు తస్మాత్ జాగ్రత్త.

- కొత్త లింగాల ఏఈ శ్రీనివాసులు.





కామేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండల పరిధిలోని గ్రామాలలో ప్రజలు తమ ఇంటి పక్కన లేదా వ్యవసాయ భూమిలో కరెంటు తీగలు ఏమైనా తెగి పడిపోయి ఉంటే విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ కు సమా చారం అందజేయాలని కొత్త లింగాల ఏఈ ఎన్.శ్రీనివాసు లు బుధవారం కోరారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు,రైతులు అప్రమత్తం గా ఉండాలని కోరారు. కొత్తలింగాల సబ్ స్టేషన్ – 8712483571, పొన్నేకల్ సబ్ స్టేషన్ – 8712483580, కామేపల్లి సబ్ స్టేషన్ – 8712483574, ముచ్చర్ల సబ్ స్టేషన్ – 8712483579, టోల్ ఫ్రీ –18004250028, 1912 ఫోన్ నెంబర్లకు సమా చారం అందజేయాలన్నారు.

అదే విధంగా విద్యుత్ శాఖ సిబ్బంది ఫోన్ నెంబర్లు కె.నర్సింహారావు కొత్తలింగాల ఎస్ ఎల్ ఐ –8712483578, ఎస్.శ్రీనివాస్ – కామేపల్లి – ఎల్ ఐ –8712483572, వి.మధు –పొన్నేకల్ – ఎల్ ఐ – 8712483575, ఎం. శ్రీనివాస్ –కామేపల్లి – ఎల్ ఎం –8712483573, ఎం.సురేష్ –పాతలింగాల – ఏ ఎల్ ఎం –7780213029, ఎం.రాంచందర్ – బాసిత్ నగర్ బంజార –ఎఎల్ఎం –9849728754,బి. నాగేశ్వరావు – ఊటుకూరు – ఏ ఎల్ ఎం –8106360143, బి.కుమార్ –పండితాపురం – ఏ ఎల్ ఎం –8247746588, బి.నాగరాజు –కామేపల్లి – జేఎల్ఎం – 9550985598 లకు ఫోన్ చేసి సమాచారం అందించి సహకరించాలని ఏఈ శ్రీనివాసులు కోరారు.

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు రాయి గూడెం లో ఉపసర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ.



నేలకొండపల్లి అక్టోబర్:28 మీ వార్త ఆర్ సి: నేలకొండపల్లి రాయి గూడెం గ్రామంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను నేలకొండపల్లి మండలంలో రాయి గూడెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బుధవారం ఉపసర్పంచి ప్రేమ్ కుమార్ బైరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మంత్రి జన్మదినాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సంబూరు నరేందర్ కోసూరు సత్యం బోయన కృష్ణయ్య బోయన బ్రహ్మం కాలింగి ఎంకన్న కాలంగి వీరబాబు తీగ రామయ్య జీడిగు బ్రహ్మ సూరపల్లి ఏసురత్నం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై ఆధారాలతో సహా జాబితా సిద్ధం

- లంచగొండితనం మానుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదు ప్రతి మండల కేంద్రంలో ఏసీబీ కార్యాలయం ఏర్పాటు చేయాలి: లోక్ రక్షక్ పార్టీ వ్యవస్థాపకుడు కొండా చరణ్.

చర్ల, అక్టోబర్ 28: మీ వార్తా ప్రతినిధి: చర్ల మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, లంచగొండితనం పెరిగిపోయాయని, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారుల తీరును ఇకపై సహించేది లేదని లోక్ రక్షక్ పార్టీ (ఎల్ఆర్పీ) వ్యవస్థాపకుడు కొండా చరణ్ హెచ్చరించారు. అధికారులు తమ వైఖరిని మార్చుకోకపోతే ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ప్రతి మండల కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బుధవారం చర్ల మండల కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో లోక్ రక్షక్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ జహీరుద్దీన్ భాష ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కొండా చరణ్ మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే సామాన్య ప్రజల నుంచి కొందరు అధికారులు బహిరంగంగా లంచాలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించి, లంచాల కోసం ప్రజలను తిప్పించుకోవడం, బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు.



అవినీతిపై పూర్తి వివరాలు మా వద్ద ఉన్నాయి

చర్ల మండలంలో ఏ అధికారి ఎవరిని, ఎప్పుడు, ఎంత లంచం అడిగారు లేదా తీసుకున్నారనే అంశాలకు సంబంధించి తమ వద్ద వివరాలు, ఆధారాలు ఉన్నాయని కొండా చరణ్ పేర్కొన్నారు. కిందిస్థాయి సిబ్బంది లంచాలు వసూలు చేస్తూ, ఆ మొత్తంలో కొంత భాగాన్ని పైఅధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి చర్యల వల్ల ఉన్నతాధికారుల ప్రతిష్ఠకు భంగం కలుగుతోందన్నారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారశైలిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. కిందిస్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసినా పట్టించుకోకపోతే, ఆ వ్యవహారాలపై ఉన్నతాధికారులు కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రతి మండల కేంద్రంలో ఏసీబీ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

చర్ల ప్రాంతం అత్యంత సున్నితమైన ప్రాంతమని, ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు స్థానిక పరిస్థితులను అర్థం చేసుకొని నీతి, నిజాయితీ, సేవాభావంతో ప్రజలకు సేవలందించాలని కొండా చరణ్ సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే అత్యున్నతమని, ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు అవినీతికి పాల్పడితే లోక్ రక్షక్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిలో పెరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు ప్రతి మండల కేంద్రంలో ఏసీబీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు లంచాల బారిన పడకుండా, అవినీతికి పాల్పడే అధికారులపై తక్షణ చర్యలు తీసుకునేలా పటిష్ఠమైన వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ పనితీరును మార్చుకొని ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కొండా చరణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో లోక్ రక్షక్ పార్టీ నాయకులు చిట్టిమల్ల సుజాత, గుర్రాల విజయ్, వెంకటలక్ష్మి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద వంద అడుగుల జాతీయ పతాకం ఏర్పాటు చేయాలి.

- ప్రభుత్వానికి భారతీయ మాజీ సైనికుల సంస్థ ఖమ్మం జిల్లా విభాగం విజ్ఞప్తి.

- శాంతి, దేశభక్తికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్ష.

నేలకొండపల్లి అక్టోబరు 28 మీ వార్త ఆర్ సి: ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి బౌద్ధ స్తూపం సమీపంలో వంద అడుగుల ఎత్తైన జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని భారతీయ మాజీ సైనికుల సంస్థ ఖమ్మం జిల్లా విభాగం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణ, వారసత్వ పరిరక్షణ విభాగం సంచాలకులకు, ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి సమర్పించేందుకు సంస్థ ప్రతినిధులు సిద్ధమయ్యారు. ప్రాచీన బౌద్ధ సంస్కృతికి నిలయమైన నేలకొండపల్లి ప్రాంతంలో జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయడం ద్వారా దేశభక్తి, శాంతి, ఐకమత్యం, త్యాగం వంటి విలువలను ప్రపంచానికి చాటవచ్చని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బౌద్ధ స్తూపం చారిత్రక ప్రాధాన్యాన్ని, జాతీయ పతాక ఔన్నత్యాన్ని సమన్వయం చేయాలన్నది తమ ప్రధాన ఆశయమని తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి దోహదం.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపం చారిత్రక ప్రాధాన్యాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఈ ప్రతిపాదన దోహదపడుతుందని సంస్థ అభిప్రాయపడింది. వంద అడుగుల జాతీయ పతాకం ఏర్పాటు చేస్తే యువతలో దేశభక్తి భావనలు పెంపొందడంతో పాటు, సందర్శకుల సంఖ్య కూడా పెరిగే అవకాశముందని పేర్కొంది. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాకం నమూనాను స్ఫూర్తిగా తీసుకుని నేలకొండపల్లిలోనూ ఇలాంటి ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపింది.



అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి.

బౌద్ధ స్తూపం చారిత్రక ప్రాధాన్యాన్ని, నిర్మాణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంబంధిత పురావస్తు, పర్యాటక, వారసత్వ పరిరక్షణ శాఖల అనుమతులు పొందేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. జాతీయ పతాక స్తంభం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించడంతో పాటు, అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని కోరారు. భారత జాతీయ పతాక నియమావళి ప్రకారం పతాకాన్ని ఏర్పాటు చేస్తామని, దాని నిర్వహణ, వెలుగుల ఏర్పాటు, భద్రత తదితర బాధ్యతలను సంస్థ తరఫున చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. బౌద్ధ స్తూపానికి ఎలాంటి నష్టం కలగకుండా, సంబంధిత నిపుణుల సూచనలు, అధికారుల అనుమతులకు అనుగుణంగా పనులు చేపడతామని స్పష్టం చేశారు.

మాజీ సైనికుల దేశభక్తి సంకల్పం.

దేశ రక్షణలో సేవలందించిన మాజీ సైనికులుగా జాతీయ పతాకం పట్ల తమకు ప్రత్యేక గౌరవం ఉందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దేశభక్తి, శాంతి, సామరస్యానికి ప్రతీకగా నేలకొండపల్లి ప్రాంతంలో భారీ జాతీయ పతాకం రెపరెపలాడాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అవసరమైన అనుమతులు, సహాయ సహకారాలు అందించాలని భారతీయ మాజీ సైనికుల సంస్థ ఖమ్మం జిల్లా విభాగం విజ్ఞప్తి చేసింది.

ఆర్ అండ్ బి విశ్రాంతి భవనాన్ని పునఃప్రారంభించాలి.

- కాకుమాని మల్లికార్జున రావు డిమాండ్.

నేలకొండపల్లి అక్టోబర్ 28 మీ వార్త ఆర్ సి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉన్న ఆర్ అండ్ బి.విశ్రాంతి భవనం (గెస్ట్ హౌస్) ప్రస్తుతం సరైన వినియోగం లేకుండా వృధాగా పడి ఉందని, దాన్ని తక్షణమే మరమ్మతులు చేసి తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని సామాజిక కార్యకర్త కాకుమాని మల్లికార్జున రావు మండల రెవెన్యూ అధికారి (తహశీల్దార్) వినతిపత్రం సమర్పించారు.

అధికారుల పర్యటనలకు ఇబ్బందులు.

నేలకొండపల్లి నియోజకవర్గ పరిధిలో ఎంతో ప్రాధాన్యత కలిగిన మండలం.ఈ నేలకొండపల్లి మండల పరిధిలో 32 గ్రామాలు ఉన్నాయి.రెవెన్యూ, మండల పరిషత్, రోడ్డు మరియు భవనాల శాఖ,వంటి పలు ప్రభుత్వ విభాగాలు ఇక్కడ పనిచేస్తున్నాయి. నిరంతరం వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులు కొద్దిగంటలు పాటు విశ్రాంతి తీసుకోవడానికి సరైన వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మండల కేంద్రంలో విశ్రాంతి భవనం అందుబాటులో లేకపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు.



పర్యాటక ప్రాంతానికి వచ్చే వారికి వసతి కరవు

నేలకొండపల్లి చారిత్రకంగా, పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి బౌద్ధ స్తూపాన్ని సందర్శించడానికి ఇతర దేశాల నుండి కూడా సందర్శకులు వస్తుంటారు.అయితే, అటువంటి సందర్శకులు మరియు ప్రముఖులు విశ్రాంతి తీసుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి తగిన విశ్రాంతి భవనం లేదా సమావేశ మందిరం అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతం.

భక్త రామదాసు పేరుతో ప్రసిద్ధి చెందిన నేలకొండపల్లి ప్రాంతానికి చారిత్రకంగా ఎంతో గుర్తింపు ఉంది. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో ఉన్న విశ్రాంతి భవనాన్ని నిరుపయోగంగా ఉంచడం వలన ప్రభుత్వ అధికారులు, సందర్శకులు మరియు ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది.

తక్షణమే చర్యలు చేపట్టాలి.

కావున,పై విషయాలన్నింటినీ దయచేసి పరిశీలించి, నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనాన్ని తిరిగి ప్రారంభించి, అవసరమైన మరమ్మతులు మరియు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిని ప్రజా ఉపయోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు తగిన శ్రద్ధ తీసుకుని,ప్రజలకు మరియు ప్రభుత్వ అధికారులకు ఉపయోగపడే విధంగా విశ్రాంతి భవనాన్ని పునఃప్రారంభిస్తారని ఆశిస్తున్నట్లు కాకుమాని మల్లికార్జున రావు తెలిపారు.

కుమార్తె ప్రేమ వివాహంతో మనస్తాపం చెందిన తండ్రి బలవన్మరణం.

నందిపేట్ : నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండకాడి రాజన్న (50) కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె (19) అదే గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించి, బుధవారం ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకుంది. తనకు ఇష్టం లేని పెళ్లి జరగడంతో పరువు పోయిందని రాజన్న మానసికంగా కుంగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మనస్తాపంతో గురువారం ఉదయం ఆయన తన పొలంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుని భార్య బండకాడి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిర్వహించి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ ఐ వినయ్ తెలిపారు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారు ఉచిత ఎవశ్రీవ–హీూచీూూ హెల్ప్‌లైన్ 14416 కు ఏ సమయంలోనైనా కాల్ చేసి సహాయం పొందవచ్చు... ప్రజా జ్యోతి.



ఓట్ల నమోదు సరే.. నిరుద్యోగ సమస్యల పరిష్కారమేది.

- రాజీవ్ యువ వికాసం, స్వయం ఉపాధి రుణాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మల్లెబోయిన ఉపేందర్.

నేలకొండపల్లి అక్టోబర్:28 మీ వార్త ఆర్ సి: నేలకొండపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమంతో పాటు నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీలు పూర్తి చేసిన వేలాది మంది యువత ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు? అర్హులైన దరఖాస్తుదారుల్లో ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన యువతకు రుణాలు, సబ్సిడీలను సకాలంలో అందించాలని సూచించారు. పథకాలను ప్రకటించడానికే పరిమితం కాకుండా, వాటి ప్రయోజనాలు అర్హులైన నిరుద్యోగులకు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని కోరారు.




ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత చర్చ జరగాలని ఉపేందర్ అన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ఎంత ముఖ్యమో, వారి సమస్యల పరిష్కారం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీను, సభ్యులు నవీన్, అఖిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ భీమా ఆర్థిక భరోసా.

- నామిని రేఖకు రూ.10 లక్షల చెక్కును అందజేసిన డీజీఎం సతీష్.

కామేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆర్థిక భరోసానిచ్చింది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం బ్రాంచ్ ఆపద సమయంలో అండగా నిలిచింది.వివరాలు ఇలా ఉన్నాయి.కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామానికి చెందిన తలారి జయ చందర్ ఫిబ్రవరి 9 తేదీ 2022లో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం బ్రాంచ్ లో బీమా పాలసీ తీసుకున్నారు.ఆయన అనారోగ్య కారణాలతో సెప్టెంబర్ 2026 లో మృతి చెందారు.దీంతో నిబంధన మేరకు నామిని అయినా అతని భార్య తలారి రేఖకు పది లక్షల రూపాయల బీమా చెక్కును శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ జోనల్ మేనేజర్ గంగుల సతీష్ ,ఖమ్మం డివిజన్ మేనేజర్ రాజబోయిన భరత్ ,ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ పిన్ని సురేష్ లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిజిఎం సతీష్ మాట్లాడుతూ ఇంట్లో కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా లభించే ఆర్థిక సహాయం కుటుంబానికి అండగా నిలుస్తుందని ఆ కుటుంబాన్ని కాపాడుతుందని అన్నారు. ఆపద సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరు తమ కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక భద్రత కోసం తగిన బీమా రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ మేనేజర్లు వెంకటకృష్ణ ,చిరంజీవి, రమేష్, తిరుపతి, అజార్ తో పాటు కొత్త లింగాల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇట్ట శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎడ్లపల్లి శేషగిరిరావు, గ్రామ శాఖ అధ్యక్షులు పగిడిపల్లి కోటయ్య,



పండగ కోటేశ్వరరావు, రాజేష్, శ్రీరామ్ డెవలప్మెంట్ ఆఫీసర్లు దారా బెంజిమన్, భూక్యా నాగేశ్వరరావు, కె.భవాని, బాసని నాగేశ్వరరావు,సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత లింగాల లో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు.





- ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

రాంరెడ్డి గోపాల్ రెడ్డి.

కామేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను కామేపల్లి మండలం పాత లింగాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిత్యం ప్రజాసేవలో నిమగ్న మవుతూ,రాష్ట్ర అభివృద్ధి లో కీలక పాత్ర పోషిస్తున్నా రని కొనియాడారు. మంత్రి మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వ ర్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించా రు.తొలుత భారీ కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి కి జన్మది నం సందర్భంగా శుభాకాంక్ష లు తెలిపారు. ఘనంగా నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, కొత్త లింగాల సర్పంచ్ ఇట్ట శ్రీనివాసరావు, పాత లింగాల సర్పంచ్ కిన్నెర నాగ సుజాత, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ నాయకు లు తోటకూరి శీను,నల్లమో తు వెంకట నరసయ్య, చామంతుల విశ్వనాథం, హెచ్.బ్రహ్మం,చల్ల సతీష్, బొందల వెంకటేశ్వర్లు,ఏదు ల వెంకట్, మధు, జక్క రవి, కృష్ణంరాజు,దొప్ప రమేష్, గరిక గోపి,గుడిమెట్ల శేఖర్, పండగ ఎంకన్న, బీరం నర సింహారావు, వల్లాల కోటి తదితరులు పాల్గొన్నారు.

మృత్యు మార్గాలుగా ఆసంపూర్తి రోడ్లు.

- ప్రమాద భాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- గాదెపాడులో వెంకటేశ్-రమ్య సంస్మరణ.

కారేపల్లి అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్డు పనులు ఆసంపూర్తిగా జరిగి మృత్యు మార్గాలుగా మారాయని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, కొండబోయిన నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పగడాల నాగరాజు లువిమర్శించారు. ఇటివల మంచుకొండ వద్ద జరిగిన ఆటోను స్కార్పియో ఢీ కొట్టిన ప్రమాదంలో మృతు చెందిన దంపతులు మద్దెబోయిన వెంకటేశ్, రమ్యల సంస్మరణ కార్యక్రమంలో బుధవారం కారేపల్లి మండలం గాదెపాడులో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోడ్డు పనులు రెండెండ్లు కావస్తున్న పూర్తి చేయక పోవటంతో ఆ రహదారిపై ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు పోతున్నాయన్నారు. గాదెపాడు చెందిన వెంకటేశ్, రమ్య దంపతులు మృతి చెందడంతో వారి ఇద్దరు చిన్నారు. వృద్దతల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రోడ్డు పనులు నత్తనడకన జరుగుతున్న దాని గురించి మంత్రులు, ఇతర ప్రజాప్రతినిదులు పట్టించుకోవటం లేదన్నారు. తక్షణమే ప్రస్తుత కాంట్రాక్టర్ను తొలగించి, కొత్త కాంట్రాక్టర్ను నియమించి రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకురాలు పగడాల మంజుల, టీడీపీ నాయకులు పుట్ట ఉపేందర్, సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, న్యాయవాది నాగేశ్వరరావు, మచ్చ శ్రీనివాసరావు, నన్నెబోయిన సర్వయ్య, నాన్నబాల



మల్లయ్య, మద్దెబోయిన సత్తిబాబు, కేలోత్ సూర్య కుమార్, మేకల రామారావు, నన్నేబోయిన వెంకన్న, పోతర్ల నాగేశ్వరరావు, గడ్డబోయిన ఉపేందర్, బండారి సాయి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం.



దమ్మపేట అక్టోబర్ 28 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు: ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జారె రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



జన్మదినాన్ని పురస్కరించుకుని దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ వినాయక ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర మాజీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు సారథ్యంలో కుమారుడు ధనుష్ ప్రణవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ముందుగా మందలపల్లి సాయిబాబా మందిరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆ తర్వాత మందలపల్లి సెంటర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని జన్మదిన వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు.

- రక్తదాన శిబిరాలు,అన్నదాన కార్యక్రమాలు భారీగా హాజరైన అభిమానులు.





ఖమ్మం అక్టోబర్ 28 మీ వార్త ప్రతినిధి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు మండలాలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు అన్నదానం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి కేకులు కట్ చేసి సంబరాలు నిర్వహించారు ఖమ్మం మంత్రిగారి క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఏడతెరపలేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభిమానులు నాయకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలలో పలువురు నాయకులు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ఆత్మ బంధుగా ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తూ లక్షలాది కోట్లాది మంది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని జననేతగా అందరూ అభిమానంగా పిలుచుకునే శ్రీనన్నగా నిజమైన ప్రజాసేవకుడుగా ముందుకు సాగుతున్నారని భవిష్యత్తులో రాష్ట్ర దేశ రాజకీయాలలో శ్రీనన్న కీలక పాత్ర పోషించి మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని నాయకులు ఆకాంక్షించారు ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి, బిఆర్ అంబేద్కర్ ప్రజా ప్రజా సంఘాల నేత లింగాల రవికుమార్, టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, షేక్ ఇమామ్ బాయ్, మాజీ ఎంపీపీ గోసు మధు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మా రోశయ్య, కోసూరు శ్రీను, చల్లా రామకృష్ణారెడ్డి, మియా భాయ్, జిలాని, జి నరసింహారావు, డి. ఎస్.యన్ రాజు, విప్లవ కుమార్, పటేల్, కొప్పెర ఉపేందర్,దుర్గ, మొగిలిచర్ల సైదులు, కరాటే వేణు, చింతమల్ల గురుమూర్తి, తాళ్లూరి రాము, తోట ప్రసాద్ నాయుడు, సతీష్, తిరుపతిరావు, జంగిపల్లి ప్రసాద్,కాంపాటి రమేష్, దామా స్వరూప, శ్రీకళారెడ్డి, ఆర్కే నాయుడు, సమీరా తదితర నాయకులతో పాటు ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు శ్రీనన్న అభిమానులు రాష్ట్ర జిల్లా మండల గ్రామ నాయకులు వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన 11 మందిని కోర్టులో హాజరు పరిచిన ట్రాఫిక్ పోలీస్ ఎస్సై పి. కేశవ రావు.

- డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారికి ఐదు రోజులు శిక్ష విధించిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం. రామదాస్.



అక్టోబర్ 28 మన మీ వార్త భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు డ్రంకెన్ డ్రైవ్ నందు పట్టుబడిన వారిని 11 మందిని కోర్టు నందు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. రాందాస్ ముందు హాజరుపర్చగా అందులో ఒక వ్యక్తికి 5 రోజులు శిక్ష జైలు విధించిగా అట్టి వ్యక్తిని రిమాండ్ కి తరలించనైనది. మద్యం సేవించడం వలన రోడ్ యాక్సిడెంట్స్ అవుతాయి కావున మద్యం సేవించి వాహనాలు నడపారాదనని, ప్రతి ఒక్కరూ రోడ్ భద్రత నియమ నిబంధనలు తప్పక పాటించాలని భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ ఎస్సై పి. కేశవ రావు తెలియజేయనది.

ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి



'రహవీర్' పీఎం రహత్ పథకాలపై కలెక్టర్ సమీక్ష

కామారెడ్డి : రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్ మరియు పీఎం రహత్ పథకాలను జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు . కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగవాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్ పథకాల అమలు తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాద బాధితులను 'గోల్డెన్ అవర్'లోపు ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.25,000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు ఉచిత (క్యాష్‌లెస్) వైద్యం అందించే పీఎం రహత్ పథకం అమలులో ఉందని వెల్లడించారు.

ముఖ్య ప్రయోజనాలు

ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స

ప్రమాదం జరిగిన తేదీ నుండి 7 రోజుల వరకు ఉచిత వైద్యం

గరిష్టంగా 1.5 లక్షల వరకు వైద్య ఖర్చులు భరిస్తారు.జాతీయ రహదారులు మాత్రమే కాదు–ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తింపు లబ్ధిదారులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రతి బాధితుడు ప్రమాద బాధితుడికి వెంటనే సహాయం చేసిన వారికి 25,000 ప్రోత్సాహం

పోలీసులు లేదా కోర్టుల ఇబ్బందుల భయం అవసరం లేదు

సహాయం చేసిన వారి వ్యక్తిగత హక్కులకు చట్టపరమైన రక్షణ

ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్టంగా 5 సార్లు బహుమతి పొందవచ్చు

లబ్ధిదారులు: ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి చేర్చిన సహాయకుడు

ఈ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, పోలీసు సూపరింటెండెంట్, జిల్లా రవాణా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)అడిషనల్ కలెక్టర్ విక్టర్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సూరజ్ ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి ఆర్డీవో ప్రభాకర్ ఆర్డీవో రవీందర్ ఆర్టీవో సంతోష్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అటవీ శాఖకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలి



కామారెడ్డి : అటవీ శాఖ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రకామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అటవీ అధికారి శ్రీ నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ఆధ్వర్యంలో అటవీ, పోలీసు శాఖల మధ్య సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి అటవీ శాఖకు సంబంధించిన వివిధ అంశాలను, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అటవీ ప్రాంతాల పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ, అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారానికి పోలీసు శాఖ అందించాల్సిన సహాయ సహకారాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సానుకూలంగా స్పందిస్తూ, అటవీ శాఖకు, ఆ శాఖ సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ సమయంలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అటవీ ప్రాంతాల పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ, అటవీ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు ఫారెస్ట్ డివిజనల్ అధికారులు ఫారెస్ట్ రేంజ్ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎస్టి కమిషన్ రాక

జాటోత్ హుస్సేన్

కామారెడ్డి : రామారెడ్డి మండల కేంద్రంలోని స్కూల్ తండా గ్రామానికి గురువారం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ స్కూల్ తండా గ్రామానికి క్షేత్రస్థాయి పర్యటన నిమిత్తం విచ్చేయనున్నారు అని మండల తాసిల్దార్ ఉమలత పత్రికా ముఖంగా తెలపడం జరిగింది.

గోపియ్య తండా, సర్పంచ్ తండా రింగ్ రోడ్డు సమస్య జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె హుస్సేన్ వినతి పత్రం సమర్పించిన సర్పంచులు

సిరికొండ, సిరికొండ మండల కేంద్రంలోని గొప్య తండా, సర్పంచ్ తాండ రింగ్ రోడ్డు పనులను నత నడక పనులు జరుగుతున్నాయని సంబంధిత కాంట్రాక్టర్కు వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని మీ ద్వారా కాంట్రాక్టర్ కు ఆదేశించాలని ఎస్టి కమిషన్ సభ్యుడు జె హుస్సేన్ నాయక్ సర్పంచులు భూక్య సంతోష్, జీవన్, రామ్ సింగ్, గిరిజన నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు



వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ ఉపాధి, పశుగ్రాస సాగును ప్రోత్సహించాలి.

- రైతులు పశువుల కోసం పచ్చిగడ్డి సాగు చేసి అదనపు ఆదాయం పొందేలా చర్యలు చేపట్టాలి.
- గ్రామాల్లో నీటి సంరక్షణ పనులు, అభివృద్ధి నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి.

భద్రాచలం అక్టోబర్ 28 మన వార్త: ఐటీడీఏ ఏజెన్సీ ఏరియా పరిధిలో వి.బి.జి. రామ్ జీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు, రైతులు పశువుల కోసం పచ్చిగడ్డి సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఐటిడిఏపీఓ బి రాహుల్ తెలిపారు. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ డి. దివ్య దేవరాజన్, ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్‌లతో కలిసి అదనపు కలెక్టర్లు, పీడీ డీఆర్‌డీఏలు, సర్పంచులు, ఎంపీడీఓలతో వి.బి.జి. రామ్ జీ పథకం అమలు, ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురవక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలకు వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాల్లోనే కొత్త పనులను గుర్తించి, వాటి ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచాలని తెలిపారు. ఉపాధి పనుల ద్వారా కూలీలకు ఆదాయం లభించడంతో పాటు, మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా సీసీ రోడ్లు, మ్యారేజ్ హాళ్లు, ఇతర గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అవకాశం



ఉంటుందని పేర్కొన్నారు.

దవి.బి.జి. రామ్ జీ పథకం కింద అనుమతించిన వివిధ రకాల పనులపై సర్పంచులకు అవగాహన కల్పించి, పనిదినాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి పది రోజుల్లోనే నిధులు ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాట్లు ఉన్నందున, నిధుల చెల్లింపులపై ఆందోళన చెందకుండా పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవనాలు, గోదాములు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించడం, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని సర్పంచులకు సూచించారు. గ్రామాలను అభివృద్ధి చేసుకొని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు వి.బి.జి. రామ్ జీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా కోటి రూపాయల నిధులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో పశువులకు, ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం వంటి నీటి సంరక్షణ పనులను కూడా పథకం కింద చేపట్టాలని సూచించారు.



రైతులు లేదా గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పశువుల కోసం పచ్చిగడ్డి సాగు చేపడితే ఎకరానికి రూ.14 వేల చొప్పున ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ సహాయాన్ని వినియోగించుకొని పశుగ్రాసాన్ని సాగు చేయడంతో పాటు, అదనపు గడ్డిని విక్రయించడం ద్వారా రైతులు మరింత ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ.. జిల్లాలోని చెరువులు, కాలువల్లో పూడిక తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వీఓ భవనాలు, అదనపు గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ం వి.బి.జి. రామ్ జీ పథకం కింద పనిదినాలను పెంచేందుకు కూలీల సంఖ్యకు అనుగుణంగా మేట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు, పశువులకు అవసరమైన పచ్చిగడ్డి సాగును ప్రోత్సహిస్తామని వెల్లడించారు. భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తదితరులు తదితరులు వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్నాబ్ తుఫాన్ విపత్తులను ఎదుర్కోవడానికి సహాయక చర్యలు ముమ్మరం.

- ప్రమాదకర ప్రాంతాలు పరిశీలన.
- భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ.

భద్రాచలం అక్టోబర్ 28 మన మీ వార్త: అర్నాబ్' తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిల్లే ప్రాంతాలను గుర్తించి ఎన్టీఆర్ ఎఫ్ బృందం మరియు అధికారులు పగడ్బందీ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు.

బుధవారం తన ఛాంబర్ లో భద్రాచలం డీఎస్పీ మరియు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్ డి ఆర్ ఎఫ్) బృందంతో ఒక సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వరదలు, భారీ వర్షాలు మరియు ఇతర విపత్తు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన సన్నద్ధతపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశం అనంతరం, సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో భద్రాచలం డీఎస్పీ,



ఎన్టీఆర్ఎఫ్ (ఎన్ డి ఆర్ ఎఫ్) బృందం, డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి డి ఆర్ ఎఫ్) బృందం మరియు అగ్నిమాపక శాఖ అధికారులు కలిసి, భద్రాచలంలోని ప్రమాదకర ప్రాంతాలను (జబశ్రీఅవతీఘఎశ్రీవ ఘతీఘ్ముం) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాలు మరియు వరదల సమయంలో ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు కలగకుండా ఉండేలా, ఈ బృందం ప్రమాదకర ప్రాంతాలను తనిఖీ తనిఖీ చేసి భద్రాచలం సబ్-డివిజన్



పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ ఇదే తరహా తనిఖీలు చేపట్టాలని, గుర్తించిన ప్రతి చోటా తగిన భద్రతా చర్యలు ఏర్పాటు చేసి ప్రజల భద్రతను సునిశ్చితం చేయాలని సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పోలీస్, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఖ

టపాకాయల అమ్మకానికి అనుమతి తప్పనిసరి సిపి సాయి చైతన్య



బాల్కొండ : దీపావళి పండుగ సందర్భంగాటపాకాయల దుకాణాదారులు తప్పకుండా సంబంధిత డివిజినల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి పోలీస్ కమిషనర్ వెల్లడి దీపావళి పండుగ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు వారి వారి సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి కార్యాలయం నుండి ధరఖాస్తు చేసుకొని అనుమతి పొందగలరు. దానికి సంబంధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ స్థాయి అధికారిని సంప్రదించగలరు.ఎవ్వరయిన సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి నుండి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను నెలకొల్పినట్లయితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు - 1884 మరియు రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠిన చర్యలు తీసుకొనబడును.

టపాకాయల దుకాణాదారులు తప్పక ఈ క్రింది నిబంధనలు పాటించాలి.

టపాకాయల దుకాణాలు సంబందిత ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పవలెను.ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికేటు పొందపర్చాలి.

విద్యార్థిని,విద్యార్థులకు ఈ వేస్ట్ పై అవగాహన కార్యక్రమం



బాల్కొండ : బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఈ-వ్యర్థాల ఈ వేస్ట్ నిర్వహణ మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ మార్గదర్శకాల ప్రకారం, అక్టోబర్ మాసంలో పాఠశాలల్లోని ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ-వేస్ట్ నివారణ క్యాంపెయిన్ విస్తృతంగా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కీలకమైన అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ-వ్యర్థాలు అంటే ఏమిటి?: కాలం చెల్లిన లేదా పాడైపోయిన మొబైల్ ఫోన్లు,లాప్‌టాప్‌లు, ఛార్జర్లు,పాత బ్యాటరీలు, వైర్లు,కంప్యూటర్ విడిభాగాలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ ఈ-వ్యర్థాల కిందికే వస్తాయని వివరించారు. వీటిని విద్యార్థులతో సేకరింపజేశారు. అంతేకాకుండా దీనివల్ల పర్యావరణానికి ముప్పు ఈ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలిపి పడేయడం వల్ల వాటిలోని సీసం, పాదరసం వంటి ప్రమాదకర రసాయనాలు నేల,నీరు, గాలిని ఎలా కలుషితం చేస్తాయోప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలియజేశారు.